నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 24 మే 2024 | RANGAREDDY

షాద్‌నగర్ రూరల్ : పల్లెప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో పచ్చదనానికి అధిక ప్రాధాన్యత
- ఏటా 70-80 లక్షల మొక్కల నాటింపునకు చర్యలు
- ఈ ఏడాది హరితహారం కొనసాగింపుపై అనుమానాలు!
- ఇప్పటివరకు మార్గదర్శకాలను జారీ చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- నిర్వహణను సైతం గాలికొదిలేసిన ప్రభుత్వం
- అటకెక్కిన గ్రీన్ బడ్జెట్.. మొక్కలు ఎండిపోతున్నా పట్టింపు కరువు!
- నిధుల్లేక.. నీరసించిన పంచాయతీలు

హరితహారంపై నిర్లక్ష్యపు నీడ!

రంగారెడ్డి, మే 23 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల్లేక పంచాయతీలు నీరసించి పోతున్నాయి. ఈ ప్రభా వం హరితహారంపైనా పడింది. ఫలితంగా మొక్కల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారిం ది. బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పల్లెలు ప చ్చదనంతో కళకళలాడాయి. కానీ..కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హరితహారంపై పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నది. ఈ ఏడాది మొక్కల నాటింపుపై ఇప్పటివరకు అధికారులకు ఎలాంటి మార్గదర్శకాలు జారీ కాకపోవడంతో హరితహారం కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సంరక్షణపై శ్రద్ధ కరువు..

గత బీఆర్ఎస్ హయాంలో నాటిన మొక్కల సంరక్షణ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. గతంలో అవెన్యూ ప్లాంటేషన్ పేరిట ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ లు రోడ్లకు ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటాయి. అయితే ఆ మొక్కల సం రక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో మొక్కల ఆన వాళ్లే లేకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి. మొక్కల చుట్టూ ఏపుగా గడ్డి, పిచ్చి మొక్కలు పెరగగా.. వాటి తొలగింపునకు తీసుకున్న చర్యలు నిల్.. కొన్నిచోట్ల గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికి నిప్పు పెట్టడంతో హరితహారం మొక్కలు బుగ్గిపాలవుతున్నాయి. ప్రతి మం గళ, శుక్రవారాల్లో విధిగా మొక్కలకు నీళ్లు పడుతున్నట్లు అధికారులు చెప్తుండగా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితులు కనబడడం లేదు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత పూర్తిగా గ్రామ పంచాయతీలదే కావడంతో నిధుల లేమితో మొక్కలకు సక్రమంగా నీళ్లు పట్టడం లేదు. మొక్కలు ఎండిపోతే..వాటి స్థానంలో కొత్తగా మొక్కల నాటించేందుకు తీసుకుంటున్న చర్యలు సైతం శూన్యమే.


శంకర్‌పల్లి నుంచి తంగెడిపల్లికి వెళ్లే దారిలో ఎండిపోయిన హరితహారం మొక్కలు

గతంలో కంటే తగ్గిన లక్ష్యం..

పచ్చదనాన్ని పెంచే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఏటా హరితహారం పేరిట భారీగా మొక్కలను నాటించింది. 2015 సంవత్సరం నుంచి యజ్ఞంలా ఈ కార్య క్రమాన్ని చేపట్టి సక్సెస్ చేసింది. ఈసారి కూడా జిల్లాలోని 558 గ్రామ పంచాయతీ ల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. గతంలో జూన్ మాసం నాటికే ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించి ఆ మేర మొక్కలు నాటేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించేవారు. కానీ..ఈ ఏడాది హరితహారానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. అంతేకాకుండా..ఈ ఏటా లక్ష్యాన్ని సైతం గణనీయంగా తగ్గించారు. కేవలం 25 లక్షల మొక్కలు నా టేందుకే ప్రణాళికను రూపొందించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నప్పటికీ మొక్కలు నాటేందుకు ఆయా శాఖలు సన్నాహాలు మొదలుపెట్టకపోవడం విస్మయం కలిగిస్తున్నది.

అటకెక్కిన గ్రీన్ బడ్జెట్..

హరితహారం కార్యక్రమం ఎప్పుడూ కొనసాగేలా గత ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. హరితహారానికి ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు హరిత నిధిని ఏర్పాటు చేసింది. ప్రతినెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధుల్లో 10 శాతం ఈ కార్యక్రమానికి ఖర్చు చేసేలా కార్యాచరణను రూపొందించా రు. హరితనిధి సేకరణలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యులను చేయాలన్న లక్ష్యంతో ఎంపీ స్థాయి నుంచి గ్రామ సర్పంచ్ వరకు, కలెక్టర్ నుంచి చిరుద్యోగి వరకు నెల వారీ వేతనం నుంచి హరితనిధిని సేకరించారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు సందర్భంగా ప్రతి రిజిస్ట్రేషన్‌పై నిర్దేశిత రుసుమును హరితనిధికి జమ చేసేలా ఏ ర్పాట్లు చేశారు. నాటిన మొక్కలను కాపాడుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం కేటా యించిన గ్రీన్ బడ్జెట్‌ను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నది.

ఈ ఏడాది హరితహారం లక్ష్యం..

శాఖ	టార్గెట్
అటవీశాఖ	3లక్షలు
విద్యాశాఖ	500
పరిశ్రమల శాఖ	లక్ష
డీఆర్డీవో	15లక్షలు
మున్సిపాలిటీలు	6 లక్షలు
మొత్తం	25.500 లక్షలు

కేసీఆర్ సర్కార్ నాటిన మొక్కలు ఇలా..

సంవత్సరం	నాటిన మొక్కలు (లక్షలలో)
2015	73.78
2016	139.24
2017	71.041
2018	86.12
2019	105.429
2020	102.745
2021	89.248
2022	77.100
2023	82.418

బీఆర్ఎస్ యజ్ఞంలా చేపట్టింది..

బీఆర్ఎస్ ప్రభుత్వం హరిత హారం కార్యక్రమాన్ని యజ్ఞంలా చేపట్టింది. గ్రామాల్లో విరివిగా మొక్కలను నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టింది. దీంతో ప్రతి గ్రామం కూడా పచ్చదనంతో వెల్లివిరుస్తున్నది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏటా కార్య క్రమ నిర్వహణకు అవసరమైన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే కాకుండా.. గతంలో నాటిన మొక్కలను సంరక్షించడంలోనూ విఫలమవుతున్నది. దీంతో పల్లెలు, రోడ్ల వెంట ఎక్కడ చూసినా ఎండిపోయిన మొక్కలే కనిపిస్తున్నాయి. హరితహార కార్యక్రమంపై నిర్లక్ష్యం తగదు.

-మంగళ్‌పల్లి నర్సింహ, కడ్తాల్ మండలం

పచ్చదనం పెంచాలి..

కాంగ్రెస్ పాలనలో హరితహారం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో పల్లెలు పచ్చదనంతో కళకళలాడాయి. ఏ ఊరు..ఏ పల్లె చూసినా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. కానీ.. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని పట్టించుకోవడంలేదు. గత ప్రభుత్వం నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో చాలా గ్రామాల్లో హరితహారం మొక్కలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి గ్రామాల్లో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకోవాలి.

-వీరాంజనేయులు, అంతారం గ్రామం, చేవెళ్ల రూరల్

నిధుల్లేక కుంటుపడుతున్న అభివృద్ధి..

అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం రూపాయి కూడా కేటాయిం చకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది. వర్షాకాలం వస్తున్న హరితహా రం కార్యక్రమ నిర్వహణకు సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ ఏటా ప్రోగ్రాం ఉంటుందా..? ఉండదా..? అనే అనుమానం మొదలైంది. పంచాయతీల్లో బడ్జెట్ లేకపోవడంతో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలి.

-మచ్చెందర్, వార్డు సభ్యుడు, హాజిపల్లి, షాద్‌నగర్‌రూరల్

బీఆర్ఎస్ హయాంలో సక్సెస్‌ఫుల్‌గా..

పర్యావరణ పరిరక్షణ, కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం హరిత హారం కార్యక్రమాన్ని అమలు చేసి సక్సెస్‌ఫుల్‌గా కొనసాగించింది. అంత మంచి కార్యక్రమాన్ని ఈ ఏటా కొనసాగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోక పోవడం దారుణం. హరితహారంతో ప్రతి పల్లె కూడా పచ్చదనంతో కళకళలాడుతుంది. అందువల్ల రేవంత్ రెడ్డి సర్కారు హరితహారం మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవడంతో పాటు ఎం డిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి.

-తెలుగు వెంకటేశ్, చేవెళ్ల

నిర్లక్ష్యం తగదు..

గత బీఆర్ఎస్ హయాంలో సక్సెస్‌ఫుల్‌గా సాగిన హరితహారం కార్యక్రమంపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. కేసీఆర్ ప్రభుత్వంలో జూన్ నెల ప్రారంభానికి ముందే ఈ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకు నే వారు. శాఖల వారీగా నాటాల్సిన మొక్కల లక్ష్యాన్ని నిర్దేశించేవారు. కానీ.. కాంగ్రెస్ సర్కార్ ఇప్పటివరకు అలాంటి చర్యలను తీసుకోలేదు. ఇప్పటికైనా హరితహా రం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి నాటిన మొక్కలను సంరక్షించడంతోపాటు కొత్త మొక్కలను నాటేందుకు చర్యలు చేపట్టాలి.

-జిల్లెల జనార్దన్‌రెడ్డి, నందిగామ

నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోవొద్దు

రంగారెడ్డి, మే 23 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో నకిలీ విత్తనాల చెలామణిని ఉక్కుపాదంతో అణచివేయాలని కలెక్టర్ శశాం క సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమా వేశ మందిరంలో ఆయన వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో నకిలీ విత్తనాలు చెలామణి కాకుండా చర్యలు తీసుకుని నకిలీ విత్తన రహిత జిల్లాగా మార్చాలన్నారు. వానకాలంలో 4,45,428 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు కానున్న పంటలకు అవసరమై న ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా చూడాలన్నారు. ప్రైవేట్ కంపెనీల ద్వా రా మార్కెట్లో చెలామణి అయ్యే అన్ని రకాల విత్తనాలను క్రమబద్ధీకరించి నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి నకిలీ సీడ్స్ జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గడువు ముగిసిన విత్తనాలు, లైసెన్స్ లేకుండా విక్రయించే వాటిని, ఒక ప్రాంతంలో లైసెన్స్ కలిగి ఉండి వేరే చోట విక్రయాలు జరిపే వారిపైనా ప్రత్యేక దృష్టి సారిం చాలన్నారు. స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్ నిర్వహణను డీలర్లు పకడ్బందీగా అమలు చేసేలా చూడాలని, పోలీస్‌శాఖ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. పదేపదే నకిలీ విత్తనాల దందాను నిర్వ హించే వారిని గుర్తించి అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాల కేసులతో సంబంధం కలిగి ఉన్న పాత నేరస్తులను తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీతా రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

అధికారులతో సమావేశమైన కలెక్టర్ శశాంక

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

మూడంచెల భద్రత

కౌంటింగ్ కేంద్రమైన చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల వద్ద పటిష్ట భద్రత

ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం

కౌంటింగ్ కేంద్రం వద్ద నిరంతర పర్యవేక్షణ

అమలులో 144 సెక్షన్

రంగారెడ్డి, మే 23 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన అధికారులు కౌంటింగ్ ప్ర క్రియ కూడా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. లోక్ సభ బరిలో 43 మంది అభ్యర్థులుండగా.. వారి భవితవ్యం ఈవీఎంలలో భద్రంగా ఉన్నది. ఏ డు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్న చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఫలితాలు వెల్లడి కానున్న జూన్ 4 వరకు కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనున్నది.

సీసీ కెమెరాలతో నిఘా..

చేవెళ్ల లోక్‌సభ పార్లమెంట్ పరిధిలోని చేవెళ్ల, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్ర నగర్, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2,877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 13న పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు పటిష్ట భద్రత మధ్య ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను డిస్ట్రిబ్యూటరీ సెంటర్లకు.. అక్కడి నుంచి చేవెళ్లలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను స్ట్రాంగ్‌రూంలకు చేర్చి అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూం లకు సీల్ వేశారు. అక్కడ సాయుధ బలగాలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. క్లోజ్డ్ సర్క్యూట్ సీసీ కెమెరాల నిరంతర నిఘా కొనసాగుతున్నది. ఒక్కో స్ట్రాంగ్ రూంను వెబ్ కాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా కలెక్టర్ శశాంకతోపాటు ఇతర ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రం లోకి ఇతరులె వరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతోపాటు కొంతమంది అధికారులను పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా నియమించారు.

కౌంటింగ్ కేంద్రంలో సదుపాయాల కల్పన..

కౌంటింగ్ రోజున ఎటువంటి గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ నిర్వహించనున్న బండారి శ్రీనివాస్ కళాశాలలో అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నారు. కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, తాగునీటి వసతితోపాటు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు, సిబ్బంది రాకపో కలు.. అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకలకు బారికేడ్లతో వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ఫలి తాల వెల్లడి తర్వాత ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు.

చేవెళ్లలోని స్ట్రాంగ్ రూం వద్ద పోలీసుల బందోబస్తు

టార్గెట్ రూ.596 కోట్లు

- ఎస్‌హెచ్‌జీలకు మంజూరు చేసే రుణాల లక్ష్యం ఖరారు
- బ్యాంకు లింకేజీ కింద రూ.554 కోట్లు, స్త్రీనిధి కింద రూ.42 కోట్లు అందించాలని నిర్ణయం
- గతేడాదితో పోలిస్తే రూ.134 కోట్ల అధికం
- జిల్లాలో 10,375 స్వయం సహాయక సంఘాలు.. 1.80 లక్షల మంది సభ్యులు

వికారాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టి ఏటా లక్ష్యానికి మించి రుణాలను మంజూరు చేస్తున్నది. సంఘాలవారీగా కాకుండా వ్యక్తిగతంగానూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీలేని రుణాలతోపాటు స్వల్ప వడ్డీతో కూడిన రుణాలను మంజూరు చేస్తున్నది. మహిళా సంఘాల సభ్యులు అధికంగా కిరాణా దుకాణాలను నిర్వహించేందుకు, గేదెలు, గొర్రెలు, మేకలను కొనుగోలు చేయడం, కూరగాయల వ్యాపారం తదితర ఉపాధిని ఏర్పాటు చేసుకునేందుకుగాను రుణాలను తీసుకుంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాలకు గత ఆర్థిక సంవత్సరానికి మించి రుణాలను మంజూరు చేసేందుకు నిర్ణయించారు. స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలకు సంబంధించి రూ.596 కోట్ల రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో బ్యాంకు లింకేజీ కింద రూ.554 కోట్ల రుణాలు, స్త్రీనిధి కింద రూ.42 కోట్ల రుణాలను మంజూరు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి పథకం కింద మంజూరు చేసే రుణాలకు సంబంధించి రూ.134 కోట్ల రుణాలను అదనంగా పెంచుతూ నిర్ణయించారు.

వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 657 గ్రామ సంఘాలుండగా, 10,375 స్వయం సహాయక సంఘాలు, 1.80 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు రుణాలను చెల్లించి తిరిగి రుణాలు పొందుతూ రెగ్యులర్‌గా ఉన్న స్వయం సహాయక సంఘాలకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అధిక ప్రాధాన్యతనిస్తూ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు తోడ్పాటునందిస్తున్నారు. అయితే ఒక్కో స్వయం సహాయక సంఘానికీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తూ ఆర్థికంగా ఎస్‌హెచ్‌జీలు వృద్ధి చెందడంలో చేయూతనందిస్తున్నారు. సంఘాల పనితీరును బట్టి పలు సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.20 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తున్నారు.

ఏటా లక్ష్యానికి మించి రుణాలు మంజూరు..

జిల్లాలో ఏటా మహిళా స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలను మంజూరు చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కూడా లక్ష్యానికి మించి రుణాలను మంజూరు చేశారు. జిల్లావ్యాప్తంగా 8794 స్వయం సహాయక సంఘాలకు రూ.462.67 కోట్ల రుణాలను మంజూరు చేశారు. మోమిన్‌పేట మండలంలో 35.69 కోట్లు, యాలాల మండలంలో రూ.27.81 కోట్లు, బషీరాబాద్ మండలంలో రూ.29.52 కోట్లు, తాండూరు మండలంలో రూ.29.13 కోట్లు, దోమ మండలంలో రూ.29.85 కోట్లు, కులకచర్ల మండలంలో 37.02 కోట్లు, నవాబుపేట మండలంలో 29.57 కోట్లు, పరిగి మండలంలో 25.01 కోట్లు, బంట్వారం మండలంలో రూ.15.67 కోట్లు, చౌడాపూర్‌లో రూ.4.63 కోట్లు, ధారూరు మండలంలో 18.88 కోట్లు, మర్పల్లి మండలంలో రూ.26.70 కోట్లు, పెద్దేముల్ మండలంలో 30.79 కోట్లు, పూడూరు మండలంలో రూ.21.18 కోట్లు, వికారాబాద్ మండలంలో 16.53 కోట్లు, దౌల్తాబాద్ మండలంలో రూ.20.82 కోట్లు, కొడంగల్ మండలంలో రూ.20.66 కోట్లు, బొంరాసుపేట్ మండలంలో 26.19 కోట్ల రుణాలను మంజూరు చేశారు.

మొండికేసిన సంఘాలపై దృష్టి..

మరోవైపు జిల్లావ్యాప్తంగా ఎన్‌పీఏ(పనిచేయని సంఘాలు)లపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మొండికేసిన సంఘాలపై దృష్టి పెట్టి సంఘాలవారీగా అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా రుణాలు తిరిగి చెల్లించడంలో మొండికేసిన సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను కూడా నిలిపివేశారు. అదేవిధంగా విలేజ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామీణ మహిళలు వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారు. అయితే జిల్లాలోని ప్రతి గ్రామంలోని స్వయం సహాయక సంఘాల్లో ఆసక్తిగల వారిలో ముగ్గురి చొప్పున ఎంపిక చేసి, వారికి స్వయం ఉపాధి కల్పనలో కొత్త, కొత్త వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసరమైన నైపుణ్యాలు, ఆర్థిక వనరులను కల్పించి సుస్థిరమైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా విలేజ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమాన్ని యంత్రాంగం అమలు చేస్తుంది. అయితే ఇప్పటివరకు 3 వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు వ్యాపారులుగా మారారు. ఎస్‌హెచ్‌జీలు ఉత్పత్తి సంబంధిత వ్యాపారాలతోపాటు వాణిజ్య, వర్తక వ్యాపారాలు, సేవా పరమైన వ్యాపారాలను ప్రారంభించారు. సంబంధిత 3 వేల మందికి వ్యాపారాలను నిర్వహించుకునేందుకుగాను బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, గ్రామసంఘం నిధుల ద్వారా సుమారు రూ.40 కోట్ల రుణాల వరకు అందజేశారు. విలేజ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన సభ్యులకు ఒక్కో సభ్యురాలికి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రుణాలను మంజూరు చేశారు.

నేడు తాండూరులో విత్తన మేళా..

ప్రధాన శాస్త్ర వేత్త డాక్టర్ సి.సుధారాణి

తాండూరు, మే 23: తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శుక్రవారం విత్తన మేళాను నిర్వహించనున్నట్లు తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సి.సుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానకాల పంటల సాగు లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు నాణ్యమైన విత్తనం అందించాలనే ఉద్దేశంతో విత్తన మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన వంగడాల లక్షణాలు వాటి గుణగణాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయంలో ఆధునిక సాంకేతికపై రైతుల సందేహాలు తీర్చటానికి ఆయా పంటల ప్రధాన శాస్త్రవేత్తలతో చర్చా గోష్ఠి ఏర్పాటు చేశామన్నారు. తాండూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో తెలంగాణ కంది-3 (టీడీఆర్‌జీ-59), ఆశ (ఐసీపీఎల్-87119) రకాల విత్తనాలను రైతులు కొనుగోలు చేసేందుకు ఉంచామన్నారు. నాలుగు కిలోల కంది విత్తనాల ప్యాకెట్ రూ.600 ఉంటుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబందించిన ఇతర విత్తనాల కోసం రాజేంద్రనగర్‌లోని ప్రధాన వ్యవసాయ పరిశోధన కేంద్రంను సందర్శించాలని తెలిపారు.